అత్యవసర సేవలకు అడ్డం

- అగ్నిమాపక కార్యాలయం పక్కనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- ఫైర్ కార్యాలయం రోడ్డుకు అడ్డంగా వాహనాల పార్కింగ్
- అగ్ని ప్రమాదం జరిగితే ఫైరింజన్ వెళ్లేందుకు ఇబ్బంది
- సేవలు ఆలస్యమై ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లే అవకాశం



అగ్నిమాపక కార్యాలయం వద్ద రోడ్డుకు ఇరువైపులా అడ్డంగా వాహనాలు

ఆదోని అర్బన్: ఎక్కడైనా ఎప్పుడైనా అగ్ని ప్రమాదం జరిగిందంటే టక్కుమని గుర్తుకొచ్చేది అగ్నిమాపకానికి ఫోన్ కొట్టడం, వారికి సమాచారం ఇవ్వడం. సమాచారం అందిన వెంటనే హుటాహుటిన వచ్చి మంటలకు అదుపు చేసి ప్రాణాలు, ఆస్తిని కాపాడేది అగ్నిమాపక సిబ్బంది, ఫైర్ ఇంజన్. అయితే కొందరు అత్యవసర వాహనం అనే స్పృహ లేకుండా దాని దారికి అడ్డంగా వాహనాలు నిలుపుతుండటంతో ఎక్కడైనా అగ్నిప్రమాదం జరిగితే ఫైరింజన్ బయకటు వెళ్లేందుకు ఇబ్బందిగా మారుతోంది. దీంతో సేవలు ఆలస్యమవుతున్నాయి.

వందలాది వాహనాలు..

పట్టణంలోని అగ్నిమాపక కార్యాలయం పక్కనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉంది. రోజుకు వందకు పైగానే ఈ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. అయితే కార్యాలయానికి పార్కింగ్ స్థలం లేదు. దీంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారంతా అగ్నిమాపక కార్యాలయం ముందు, రోడ్డుకు అడ్డుగా వాహనాలకు నిలుపుతున్నారు. దీంతో ఫైర్ సిబ్బంది అత్యవసర సమయంలో వాహనాన్ని బయటకు తీసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అత్యవసరంలో కష్టం

ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అత్యవసరంగా ఫైర్ ఇంజిన్ వాహనం బయటకు రావాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారంతా వాహనాలు వదిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ, డాక్యుమెంట్ రైటర్లతోనూ ఉంటారు. ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం వస్తుందో తెలియదు. దీంతో వాహనం అగ్నిమాపక కార్యాలయం నుంచి వాహనం బయటికి వచ్చి.. ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లాలంటే కనీసం అరగంట ఆలస్యమవుతోంది. వాహనాలను దారి తీయించి వెళ్లాల్సి ఉంటుంది. దీంతో అక్కడ జరిగిన ప్రమాదం, ఆస్తినష్టం పెరిగే పరిస్థితి ఉంది.

రెండు రోజుల్లో గేటు ఏర్పాటు చేస్తామన్నారు..

ఫైర్ ఇంజిన్ బయటకు వెళ్లాలంటే వాహనాలు అడ్డుగా ఉంటున్నాయి. పలుమార్లు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులకు ఈవిషయాన్ని తెలియజేశాం. రెండు రోజుల్లో గేటును ఏర్పాటు చేసి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో వాహనాలు రాకుండా చేస్తామని చెప్పారు. వాహనాలు అడ్డం ఉంటే అత్యవసర పరిస్థితిలో ఆలస్యమవుతుంది. రెండు రోజుల్లో గేటు ఏర్పాటు చేయకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం. – రామాంజనేయులు, ఇన్‌చార్జ్ అగ్నిమాపక కార్యాలయం అధికారి

క్లుప్తంగా

సబ్‌కలెక్టర్‌ను కలిసిన నూతన డీఎస్పీ



సబ్‌కలెక్టర్‌తో నూతన డీఎస్పీ ఎం.హేమలత

ఆదోని రూరల్: ఆదోని సబ్‌కలెక్టర్ చాంబర్‌లో సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను శనివారం ఆదోని డివిజన్ నూతన డీఎస్పీ ఎం.హేమలత కలిశారు. పూలమొక్క అందజేశారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు పోలీసుశాఖ ఫ్రెండ్లీగా ఉండాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

7 నుంచి ఆల్ డిపార్ట్‌మెంట్ ఫ్రెండ్ షిప్ కప్

ఆదోని రూరల్: ఫిబ్రవరి 7, 8, 9వ తేదీల్లో ఆదోని మున్సిపల్ మైదానంలో ఆల్ డిపార్ట్‌మెంట్ ఫ్రెండ్ షిప్ కప్–2025 పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ముజీబ్‌అహ్మద్ తెలిపారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ మైదానంలో పోటీలకు అనుమతి కోరుతూ వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు అందజేశారు.

బెస్ట్ బీఎల్‌ఓగా వాసంతి



జాయింట్ కలెక్టర్ నవ్య నుంచి అవార్డు అందుకుంటున్న వాసంతి

నందవరం : మండల పరిధిలోని ఇబ్రహీంపురం పోలింగ్ కేంద్రం–2 మహిళ పోలీసు బి. వాసంతి బెస్ట్ బూత్ లెవల్ ఆఫీసర్(బీఎల్‌ఓ)గా ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం జాయింట్ కలెక్టర్ నవ్య చేతుల మీదుగా బెస్ట్ బీఎల్‌ఓగా ప్రశంసా పత్రం, అవార్డును అందుకున్నారు.

ఏపీఓగా మాధవ శంకర్



కోసిగి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మండల ఏపీఓగా మాధవశంకర్ శనివారం పూర్తి బాధ్యతలు చేపట్టారు. ఆయన కౌతాళం మండలంలో పనిచేసి బదిలీ పై కోసిగికు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏపీఓ చంద్రశేఖర్ అనారోగ్యం కారణంగా సెలవుల్లో వెళ్లారు. అలాగే ఈసీగా ఖాలిక్ నియమితులయ్యారు.

డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న నాగరాజు గుండెపోటుతో మరణించాడు. కాలేజీ యాజమాన్యం తరుపున అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది బాధిత కుటుంబానికి రూ. 55 వేలు ఆర్థిక సాయం అందచేశారు. కాలేజ్ ప్రిన్సిపాల్ డా. సుధాకర్ మాట్లాడుతూ తమ వంతుగా నాగరాజు భార్య సువర్ణకు రూ. 50 వేలు ఆర్థిక సాయం అందజేశామన్నారు. అలాగే కుటుంబంలో ఒకరికి కాలేజీలో ఉద్యోగం ఇస్తామని చెప్పారు. ప్రిన్సిపాల్‌తో పాటు ఏవో ఈరన్నగౌడ్, నందకిషోర్ తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న హెచ్‌ఎం జ్యోతి,సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక హెచ్‌బీఎస్ కాలనీలో పూలే, అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ ఆశ్రమానికి రెయిన్‌బో ఇంగ్లిష్ మీడియం స్కూల్ హెచ్‌ఎం జ్యోతి, సిబ్బంది, విద్యార్థులతో కలిసి నిత్యావసర సరుకులను శనివారం అందజేశారు. అదే విధంగా బైలుప్పల అక్బర్ సాహెబ్ 17వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుమారుడు బైలుప్పల షఫీవుల్లా, మిత్రులు ఆశ్రమంలోని బాలబాలికలకు అన్నం పాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకులు సింగనేటి నరసన్న, ప్రతిభా భారతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం

గోనెగండ్ల : ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహదేవ్ అన్నారు. శనివారం గోనెగండ్ల, గాజులదిన్నె, నెరుడుప్పల తదితర గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహించారు. అనంతరం మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు క్రాంతి కుమార్, రామాంజి, హనుమంతు, ఫిలిప్, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 23వ వార్డులో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. ఆయా పనులను నాణ్యతతో చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఏఈ మదన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నేడు మాంసం దుకాణాలు మూసివేయాలి

ఆదోని టౌన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని మాంసం దుకాణాలను మూసివేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ ఆదేశించారు. శనివారం ఆయన మాట్లాడుతూ గణతంత్ర్య దినోత్సవం రోజున జంతు వధ, మాంసం విక్రయాలు జరగకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్‌మెంటల్ సెక్రటరీలు చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా జంతు వధ చేసినా, మాంసం విక్రయించినా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఏకగ్రీవంగా ఉప్పర సగర సంఘ ఎన్నిక

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక రామస్వామి ఆలయంలో శనివారం ఉప్పర సగర సంఘ అధ్యక్షుడిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా బసర కోడు వీరేంద్రను ఎన్నుకోగా ఉప్పర శ్మశాన వాటిక ప్రహరి నిర్మాణానికి రూ.2లక్షలు ఇస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు. ఉప్పర జాతి మహనీయుడైన భగీరథుడి విగ్రహ ఏర్పాటుకు తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉప్పర సగర సంఘ నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్



మాట్లాడుతున్న సివిల్ జడ్జి జి. అర్చన

కోసిగి: విద్యతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని, కుటుంబంలో ప్రతి ఒక్కరూ చదువుకోవాలని ఆదోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అర్చన అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పొదుపు మహిళలు, ఐసీడీఎస్ కార్యాకర్తలకు మహిళ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల హక్కులు, రాజ్యాంగం కల్పించిన చట్టాలపై అవగాహన కల్పించారు. రాజకీయంగా, ఆర్థికంగా సామాజికంగా స్త్రీ పురుషులకు సమాన హక్కులు అవకాశాలు రాజ్యాంగం కల్పించిందన్నారు. లింగవివక్ష నిషేధించిదని చెప్పారు. వెనుకబడిన కోసిగి మండలంలో ప్రజల్లో పూర్తిగా చైతన్యం తీసుకొచ్చేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల లీగల్ సర్వీసు అథారిటీ రమాదేవి, మేరి, న్యాయవాదులు లోకేశ్‌కుమార్, సుబ్బన్న, వెంకటేశ్వర్లు, ఏపీ రజక వెల్ఫేర్ అండ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సి.సావిత్రి, ఎంఈఓ–2 శోభరాణి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలును సందర్శించిన జడ్జి



జైలులోని కిచెన్‌ను పరిశీలిస్తున్న జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్: పట్టణంలోని స్పెషల్ సబ్ జైలును శనివారం రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ సందర్శించారు. సబ్‌జైలులో భోజన వసతి, స్టోర్ రూమ్, కిచెన్ తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఖైదీలకు ఏవైనా అవసరాలు, సమస్యలు ఉన్నట్లయితే మండల న్యాయసేవాధికార సంస్థ వారి దృష్టికి తీసుకురావాలన్నారు. సంస్థ ద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని, అన్ని విషయాల్లో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ నజీర్‌అహ్మద్, సబ్‌జైలు న్యాయవాది ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులను ఆదుకోవాలి

కౌతాళం: విభిన్న ప్రతిభావంతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని మంత్రాలయం నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడు తాయన్న అన్నారు. శనివారం మండల కేంద్రమైన కౌతాళంలో విభన్న ప్రతిభావంతుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అవసరమైన వారికి రుణాలు ఇవ్వాలన్నారు. అనంతరం దివ్యాంగులందరితో కలిసి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈరన్న, ఉపాధ్యక్షుడిగా హనుమంతు, రామాంజినేయులు, జనరల్ సెక్రటరీగా నాగరాజు, ట్రెజరర్‌గా సర్వభూషణ్‌లను ఎన్నుకున్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



అధికారులకు సూచనలిస్తున్న జడ్జి పి.హేమ

ఎమ్మిగనూరుటౌన్: కక్షిదారులు కేసుల్లో రాజీ అయ్యేందుకు జాతీయ లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హేమ సూచించారు. మార్చి 8వ తేదీన ఆదోని జూనియర్ సివిల్ కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై శనివారం స్థానిక కోర్టులో పోలీసు అధికారులు, న్యాయవాదులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ కేసులు, ప్రామిసరి నోట్ కేసులు, చెక్‌బౌన్స్, సారా కేసులతో పాటు పబ్లిక్ న్యూసెన్స్ తదితర కేసులను పరిష్కరించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు విమల, ఏజీపీ వీరాస్వామి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురు రాజారావు, పట్టణ సీఐ వి. శ్రీనివాసులు, రూరల్ ఎస్‌ఐ కె,శ్రీనివాసులు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, న్యాయవాదులు పాల్గొన్నారు.

బాబూ.. సూపర్ సిక్స్ హామీలు ఎక్కడ?



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఎక్కడ బాబూ అంటూ మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం మాజీ ఎమ్మెల్యే తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు లేనిపోని హామీలు, వాగ్దానాలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచి అధికారం చేపట్టి ఏడు నెలలు కావొస్తున్నా నేటికీ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలేదన్నారు. రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచిన ఘనత చంద్రబాబునాయుడికే దక్కిందన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు వారి బాగు కోసమే బాబు పరిపాలన కొనసాగిస్తున్నాడని, వాస్తవానికి ఓట్లు వేసి గెలిపించిన రాష్ట్ర ప్రజల కోసం ఏమీ కాదన్నారు. అన్నివర్గాలను గుర్తించి వారి బాగుకోసం, వారి సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలని సూచించారు.

జగన్‌ను విమర్శించే అర్హత లేదు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను విమర్శించే స్థాయి కూటమి ప్రభుత్వానికి లేదని మాజీ ఎమ్మెల్యే అన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అన్నివర్గాల ప్రజలకు సామాజిక న్యాయం, నవరత్నాల పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఇంట సంక్షేమ పథకాలు చేరాయన్నారు. అయితే నేడు ఒక్కటంటే ఒక్కటి అమలు కాలేదన్నారు. తమ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షలు విలువ చేసే మెరుగైన వైద్యం కల్పిస్తే, నేడు ఆ పథకమే లేకుండా చేస్తున్నారని మండి పడ్డారు.

మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

ఆదోని నియోజకవర్గంలో బూత్ కమిటీ వింగ్స్ అధ్యక్షుడిగా తనను ఎంపిక చేసినందుకు చలపతి పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలియజేశారు. శనివారం ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి నివాసానికి కౌన్సిలర్ చలపతి, ఆయన అనుచరులు వెళ్లి శాలువాలు కప్పి, భారీ గజమాలతో సత్కరించారు. విశ్వనాథ్, మల్లి, వీరేష్, లోకేష్, రాము, మహేంద్ర, స్వామి, షేక్షావలి ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



సుజయింద్ర కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వై.సీతారామిరెడ్డి, నాయకులు

మంత్రాలయం: కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా సింధనూరు శివారులో ట్రాక్స్ వాహనం పల్టీ కొట్టిన ఘటనలో నలుగురు వేద విద్యార్థులు మృతి చెందిన విషయం తెలిసిందే.. అందులో మృతులు సుజయింద్ర, డ్రైవర్ కంసాలి శివ కుటుంబ సభ్యులను శనివారం టీటీడీ మాజీ బోర్డు సభ్యులు వై.సీతారామిరెడ్డి పరామర్శించారు. కంసాలి శివ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం రాఘవేంద్రనగర్‌లో డ్రైవర్ సంగమేష్ నివాసానికి చేరుకొని ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు రూ. 5 వేల నగదును అందజేశారు. వీరితో పాటు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు జి.భీమారెడ్డి, మండల ఇన్‌చార్జ్ సి.వి. విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్, ఎంపీటీసీ సభ్యులు వెంకటేష్‌శెట్టి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పిల్లలను విద్యకు దూరం చేయొద్దు



ఎంఈఓలకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఎమ్మిగనూరురూరల్: తమ గ్రామం నుంచి జెడ్పీ పాఠశాలను వేరే గ్రామానికి తరలించి తమ పిల్లలను విద్యకు దూరం చేయవద్దని సర్పంచ్ శాంతమ్మ అన్నారు. శనివారం మండల పరిధిలోని టీఎస్ కూళ్లూరు గ్రామస్తులు మండల పరిషత్ సమావేశ భవనంలో మండల విద్యాధికారులు ఆంజనేయులు, మధుసూదన్‌రాజులకు వినతి పత్రం అందజేశారు. సర్పంచ్ శాంతమ్మ మాట్లాడుతూ గ్రామంలోని స్కూల్‌ను కె.తిమ్మాపురం గ్రామానికి తరలిస్తున్నారని తెలిసిందని, ఇలా చేస్తే మా గ్రామానికి చెందిన ఆడపిల్లలు వేరు గ్రామానికి వెళ్లి చదవుకోలేరన్నారు. దీంతో తల్లిదండ్రులు వారికి పెళ్లిల్లు చేసి పంపే పరిస్థితి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఇలాంటి అనాలోచిత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

సిద్ధరూఢ స్వామికి విశేష పూజలు

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామంలో సద్గురు శ్రీ సిద్ధరూఢ స్వామి ఆలయంలో 21వ పూజమహోత్సవం కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. కువజాముగ నుంచి స్వామి వారికి అభిషేకాలు, ఫల,పుష్పాలంకరణలు గావించి మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. కర్ణాటక రాష్ట్రం హుబ్బళి శాంతాశ్రమం, విజయపూర శ్రీషణ్ముఖరూఢ స్వామి మఠం పీఠాధిపతి సద్గురు అభినవ సిద్ధరూఢ మహాస్వాములు ముఖ్యఅతిథులుగా హాజరైయ్యారు. గ్రామస్తులు, భక్తులు గ్రామ శివారు నుంచి పీఠాధిపతులను కలశాలు, డప్పువాయిద్యాలతో స్వాగతం పలికి ఊరేగింపుగా ఆలయం వరకు తీసుకొచ్చారు. పూజోత్సవానికి వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి హాజరై స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసుకున్నారు.

వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: ఏపీ వెలుగు పథకంలో పనిచేస్తుండగా తొలగించిన వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలని ఏపీ వెలుగు వీఓఏల యూనియన్ జిల్లా అధ్యక్షుడు బసవరాజు డిమాండ్ చేశారు. శనివారం మధ్యాహ్నం పట్టణంలో వీఓఏల యూనియన్ కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాల యూనియన్ లీడర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 24 సంవత్సరాల నుంచి గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంతో వీఓఏలు కీలకంగా వ్యవహరించారన్నారు. ఎటువంటి వేతనం లేకుండా పనిచేసిన వారిని అన్యాయంగా ఇప్పుడు తొలగించటం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. వీఓఏల తొలగింపులు ఆపాలన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా కోశాధికారి పద్మావతి, జిల్లా ఉపాధ్యక్షుడు మిన్నెల్ల, గౌరవ అధ్యక్షుడు మద్దిలేటి, గౌరవ సలహాదారుడు రామలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలు మంచిది కాదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: టీడీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచి జిల్లాలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులు చేస్తూ ఫ్యాక్షన్‌కు పురుడు పోస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆలూరు నియోజకవర్గం ఆరికేర గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం కోసం ఈరన్నను హత్య చేయడం చాలా దారుణమన్నారు. ఇలా కక్ష సాధింపు చర్యలకు పాల్పడాలంటే 2019 నుంచి 2024 వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉండిందని, తాము ఎక్కడా కుడా ఇలాంటి దాడులను ప్రోత్సహించలేదు. ఉద్యోగాలు, పదవుల విషయాల్లో ఒక్కటికి రెండు సార్లు ఆలోచించి మాట్లాడి సామరస్యంగా సాధించుకోవాలే గానీ ఇలా దాడులు, హత్యలు చేస్తూ పోతే భవష్యత్తులో తీవ్ర పరిణామాలకు దారితీస్తుందన్నారు. హత్యకు పాల్పడిన, ప్రోత్సాహించిన వారిని వెంటనే అరెస్ట్ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

59 మందికి ఉద్యోగావకాశాలు

ఆదోని రూరల్: ఆదోని న్యాక్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారు శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 59 మంది నిరుద్యోగులు ఉద్యోగాలు పొందినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆనంద్‌రాజ్‌కుమార్ తెలిపారు. 111 మంది ఇంటర్వ్యూల్లో పాల్గొనగా, 22 మంది క్రెడిట్ యాక్సిస్‌కు, 29 మంది వికాసలో, 8 మంది బీఎంఎస్ సెక్యూరిటీస్‌కి ఎంపికయ్యారని తెలిపారు. న్యాక్ ఇన్‌చార్జ్ ఉలిగన్న, కో ఆర్డినేటర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను హత్యచేయడం దారుణం



గోనెగండ్లలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది

గోనెగండ్ల : ఆలూరు మండలం అరికెర ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను హత్య చేయడం దారుణమని గోనెగండ్ల మండలం ఉపాధి హామీ సిబ్బంది, మండల కార్యాలయ సిబ్బంది అన్నారు. శనివారం మండల కేంద్రం గోనెగండ్లలోని ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల కార్యాలయ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి ఈరన్న హత్యకు నిరసన తెలియజేశారు. మౌనం పాటించి ఈరన్నకు నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీఓ మణి మంజరికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది ఉస్మాన్, చిట్టెమ్మ, అయ్యస్వామి, రసూల్, బాషా తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్బారాజుతో పాటు ఏపీఓ బజారి, ఈసీ మహమ్మద్ రఫీక్, సిబ్బంది శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి ఆలూరు మండలం అరికెర ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న హత్యపై నిరసన తెలిపారు.

పెద్దకడబూరు : ఈరన్న హత్యపై శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జయరాముడు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, సచివాలయ సిబ్బందితో కలసి నల్లబాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

ఓటే వజ్రాయుధం



ఓట్ అక్షరం రూపంలో కూర్చున్న ఆదోని ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

ఆదోని రూరల్: ఓటే వజ్రాయుధం అని, ఓటు హక్కుపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం ఆదోని మున్సిపల్ గ్రౌండ్ నుంచి భీమా సర్కిల్ మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. భీమా సర్కిల్‌లో అధికారులు, ఓటర్లు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రభుత్వ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు, పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ నమోదు కార్యక్రమంలో ఉత్తమంగా ప్రదర్శన చూపిన బీఎల్‌వోలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ఎన్నికల ఉప తహసీల్దార్ గాయత్రి, ఉప తహసీల్దార్ వలిబాషా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ మురళీ మోహన్ ఆధ్వర్యంలో జాతీయ జెండా పట్టుకొని విద్యార్థులు ఓటు అనే ఇంగ్లిషు అక్షరాల రూపంలో కూర్చొని ప్రతిజ్ఞ చేశారు.

పెద్దకడబూరు : స్థానిక తహసీల్దారు కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ తహసీల్దారు శ్రీనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అక్కడ మానవ హారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

కోసిగి: మండల కేంద్రంలో తహసీల్దార్ రుద్రగౌడ ఆధ్వర్యంలో వీఆర్వోలు, గ్రామ వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు, బాలుర, బాలికల పాఠశాలల విద్యార్థులచే పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

ఎమ్మిగనూరురూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం అవరణ నుంచి తహసీల్దార్ శేషఫణి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, సోమప్ప సర్కిల్‌ల్లో ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఎర్రకోట సెయింట్ జాన్స్ ఫార్మసీ కాలేజీలో ప్రిన్సిపాల్ డా. శ్రీనివాసుల ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు.

నందవరం : స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం వరకు తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులు, రెవెన్యూ అధికారులు ర్యాలీ చేపట్టారు. డీటీ శశిశేఖర్ ప్రతిజ్ఞ చేయించారు.

కారు ఢీ కొని భక్తురాలికి గాయాలు

మంత్రాలయం: మండల పరిధిలోని చెట్నేహళ్లి గ్రామ శివారులో పాదయాత్రగా వస్తున్న భక్తురాలిని కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. మంత్రాలయం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చెన్నైకి చెందిన అంబికా అనే భక్తురాలు తుంగభద్ర నుంచి మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి పాదయాత్రగా వస్తుండగా బొప్పాయి తోట వద్ద కారు వెనుక వైపు నుంచి ఢీకొట్టి పొలాల్లో పల్టీలు కొట్టింది. గాయపడిన అంబికాను స్థానిక మఠం ఆస్పత్రిలో చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం రాయచూరుకు తరలించారు.